● క్యారెక్టర్ కథలు —విశ్వనాథ పావనిశాస్త్రి

## సాధుశీలం

''ఒరేయ్ పెద్దబాబూ! నేనిట్టా సచ్చిపోవాల్సిందేనా? నా కోరిక ఈ జన్మకి తీరదా?'' అంది అరుంతమ్మ.

''ఏంటే నీ గోల! నా సావు నే సస్తా వుంటే!'' అన్నాడు పెద్దబాబు.

''శుభం గురించి నే మాట్టాడతా వుంటే సావంటావేంట్రా సచ్చినాడా!'' అంటూ ''మూలన బడ్డాను, ఏడాదైంది మంచంలోంచి లేవలేను కాబట్టి నిన్ను బతిమా లాల్సొస్తోంది. లేకపోతే ఈపాటికి నేనే పది మందిని పిలుసుకొచ్చేదాన్ని కానా?'' అని వెళ్ళబోసుకుంది అరుంతమ్మ.

పెద్దబాబు తల్లి మంచం దగ్గిరి కొచ్చి ''అమ్మా! నాకు తెలవకడుగుతాను గానీ, ఏందే నీకీ పిచ్చి! సాదులకీ, సన్నాసులకీ అన్నాలు పెడ్తే మోక్షాలొస్తాయంటే?'' అన్నాడు.

''ఒరేయ్! అల్లా అంటే కళ్ళు పోతాయ్‌రా! ఎదవాని!'' అంది అరుంతమ్మ.

''సర్లే! ఇయ్యాలా రేపూ కళ్ళేవడికుండి ఏడిసినాయిపోడానికి. అయినా తల్లిమాట కాదంటున్నాడన్న అప్రదిష్ట నాకెందుకు? సాయంత్రంతకల్లా ఓ సాదువుని కొట్టుకొస్తాను. నీ కోడలు చేత వండించి కడుపునిండా మెక్కించు'' అన్నాడు పెద్దబాబు.

''ఎదవ సచ్చినాడా! కొట్టుకొస్తావా! ఇంకా నయం! కొట్టుకుంటూ తెస్తానన్నావు కాదు. ఎదవల్తో తిరిగి సెడిపోయావ్ ఎదవాని!'' అని తిట్టింది తల్లి.

''సర్లే తీసుకొస్తాలే! తోడుకొని తెస్తా! ఊరికే నసగా తిట్టమాక!'' అని పెద్దబాబు బయటికిపోతూ ''అయినా ఈ ముసలి ముండ పిచ్చి గాని సాదువుల్లో నిజంగా ఒక్కడంటే ఒక్క సాధువున్నాడా? అంతా గంజాయి దమ్ము బటాచోరుగాళ్ళే!'' అనుకున్నాడు.

* * *

ఎట్లాగయితేనేం అన్ని పన్లూ మానుకుని సాయంత్రం దాకా తిరిగి ఒక సాధువుని పట్టుకున్నాడు.

అతగాడు ఊరిలో ఒక మూలగా కూర్చున్నాడు. ఎవర్నీ నోరెత్తి నయా పైసా అడగడం లేదు. అతని కళ్ళు అరమోడ్పులై ఆ కళ్ళలో భక్తి పారవశ్యం కనిపించింది పెద్దబాబుకి. అతని దరిదాపులలో ఎక్కడా గంజాయి చిలుముగొట్టం లేదు.

* * *

''ఏమేవ్! అమ్మా! ఇదిగో బంగారం వంటి సాధువుని తీసుకొచ్చాను. చక్కగా కడుపునిండా పెట్టుకో!' ' అని చిన్నగా అరుచుకుంటూ లోపలి కొచ్చాడు పెద్దబాబు

అరవై వసంతాలు అవలీలగా చూసిన అరుంతమ్మ ఆరు ఋతువుల నుంచీ మంచంలోంచి లేవలేని అరుంతమ్మ పాపం ఆనందంగా మెల్లగా లేచి దణ్ణం పెట్టుకుంటూ బయటికి పాక్కుంటూ వచ్చి ''బాబూ! నా సేతుల్తో ఎంతో మందికి భోజనం పెట్టాను. సచ్చేలోగా సివరి సారిగా ఓ సాధువుకి భోజనం పెట్టి సద్దామని ఆశ! శివమూర్తి లాటి సాధువ్వి దొరికావు. అంతా సిద్దంగా వుంది.

కాళ్ళు కడుక్కుని రా అయ్యా!'' అంది అరుగుమీద కూర్చున్న సాధువుతో!

సాధువుగారు మాట్లాడకుండా వచ్చి విస్తరి ముందు కూర్చున్నాడు.

పప్పు, రెండు కూరలు, రెండు పచ్చళ్ళు, గారెలు, అప్పాలు, పాయసం, పకోడీలు, కమ్మని నెయ్యి, సాంబారు, రసం, గడ్డ పెరుగు! సాధువుగారి అరమోడ్పు కన్నులు అరవిందాలై పోయాయి! సాధుగళం ఇంగుమంది ''తల్లీ! ఇంత మంచి భోజనం పెట్టావు. కొస్త మందుంటే చూడబోయినావా, సంపూర్తి అయ్యేదిగదా విందు!'' ●




LINTAS MIL PCNO 5 1210 TL


## గోర్బీ వ్రాతలు

ఏదైనా పదవిలో వున్న వ్యక్తి ఏవైనా వ్రాస్తే వాటికి విపరీతమైన క్రేజ్ వుండడం సహజమే. అదీ ఇంగ్లీష్ పబ్లిషర్స్ అయితే ఎంతకైనా వెనుకాడక హక్కులు కొనుక్కుంటుంటారు.

అదే సాక్షాత్తు ప్రపంచ ప్రజల డార్లింగ్ పొలిటీషన్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత అయిన మైఖేల్ గోర్బచేవ్ వ్రాస్తే ఎంత క్రేజ్ వుండాలో? అదీ ఆయన్ని పదవీచ్యుతుణ్ణి చేయడానికి జరిగిన కుట్ర గురించి వ్రాయడం అంటే మరింత క్రేజ్.

అందుకే గోర్బీ వ్రాసిన 72 పేజీల ఆగస్ట్ కుట్ర ప్రచురణ హక్కులు ఐదు లక్షల డాలర్లకు ''హార్ పెర్ కొలిన్స్ పబ్లిషింగ్ కంపెనీ'' అనే సంస్థ కొనుగోలు చేసినట్లు న్యూయార్క్ టైమ్స్ రిపోర్ట్ చేసింది.

ప్రజలు ఉత్కంఠతో ఎదురు చూస్తున్న ఈ పుస్తకం ఎన్ని భాషలలోకి అనువదించబడుతుందోనని గోర్బీ అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇంతవరకు 287 భాషలలోకి అనువదించబడిన వాల్ట్ డిస్నీ వ్యంగ్య చిత్రాలను, 276 భాషల్లోకి అనువదించబడిన లెనిన్ రచనలను, 262 భాషల్లోకి అనువదించబడిన అగథా క్రిస్టీ రచనలను మించి పోగలదని ఆశిస్తున్నారు. ఎంత వరకు వెళ్తుందో వేచి చూడాల్సిందే గోర్బీ పుస్తకం!

- ఏనుగు కిశోర్ బాబు, న్యూఢిల్లీ